క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఉలవపాడు: మండల పరిధిలోని చాగల్లులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

19న మండల సమావేశం

పొన్నూరు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 19వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సీఎస్‌పురం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు తహసీల్దార్ ఏ బాలకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్ తిరుపతి రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు పండించాలి



ఉప్పలదిన్నెలో రైతులకు రాయితీ పరికరాలు అందజేస్తున్న బోర్డు అధికారులు

పొన్నలూరు: పొగాకు సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నాణ్యమైన దిగుబడి పొందాలని జీపీఐ కంపెనీ ప్రతినిధి పి.కృష్ణప్రేమ్ సూచించారు. మండలంలోని ఉప్పలదిన్నె గ్రామంలో మంగళవారం కందుకూరు పొగాకు బోర్డు ఒకటో వేలం కేంద్రం, జీపీఐ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో పొగాకు రైతులకు వ్యక్తిగత రక్షణ పరికరాలు(పీపీఈ కిట్లు), రాయితీ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి మాట్లాడుతూ.. గంధకం రంగులో ఉన్న ఆకులను మాత్రమే విరవాలన్నారు. విరిచిన ఆకులకు ఎక్కువగా ఎండ తగలకుండా పట్ట కప్పాలని సూచించారు. పొగాకు అల్లిన కర్రలను బ్యారన్‌లో అధికంగా పెట్టకూడదని, ఇనుప గొట్టాల వేడి పై వరకు చేరేలా గోడలకు పది అంగుళాల ఖాళీ ఉంచాలని స్పష్టం చేశారు. పండు ఆకు కింది వరుసలో, మధ్యస్థ ఆకును మధ్య వరుసలో, పచ్చ ఆకును పై వరుసలో పెట్టి క్యూరింగ్ చేయాలని, తప్పకుండా జల్లెడ అమర్చుకోవాలన్నారు. గ్రేడింగ్ సమయంలో అన్యపదార్థాలు తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో వేలం నిర్వాహణాధికారి మీనా, జీపీఐ కంపెనీ ప్రతినిధి ఉన్నం శ్రీనివాస్, క్షేత్ర అధికారి ఉపేంద్ర, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

పాస్టర్స్ నూతన కమిటీ ఏర్పాటు

పొన్నలూరు: మండల పాస్టర్స్ నూతన కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణంలో కోఆర్డినేటర్ తగరం మోహన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి.జాన్, ఉపాధ్యక్షులుగా బి.జైపాల్, కార్యదర్శిగా ఎం.లాజర్, సహాయ కార్యదర్శిగా వై.దానుబాబు, కోశాధికారిగా కె.బాబురావు, కమిటీ సలహాదారులుగా రెవరెండ్ పాస్టర్ చుండి ప్రభాకర్, మందా స్టీవెన్ పాల్‌ను ఎన్నుకున్నారు.

20 వరకు దరఖాస్తుల స్వీకరణ

కనిగిరి రూరల్: షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల, పౌరహక్కుల చట్టం అనధికార కమిటీ సభ్యులను రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఎన్నుకుంటామని సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఈ రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులను సహాయ సాంఘీ సంక్షేమ అధికారి కనిగిరి, శివనగర్‌కాలనీలో అందచేయాలన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



సంక్షేమ పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

లింగసముద్రం: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. మాలకొండ్రాయునిపాలెం సచివాలయం పరిధిలోని విశ్వనాథపురంలో రెండో రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అందిస్తున్న సేవలు, వివిధ రకాల పథకాల గురించి ప్రజలకు వివరించారు. గ్రామంలో కొందరికీ రైతుభరోసా రాకపోవడంపై వ్యవసాయాధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలో సిమెంట్ రోడ్లు నిరించారని సైడు కాలువ లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు మోకాలి లోతు నీరు నిల్వ ఉంటుందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పంచాయతీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ అందుతున్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. జీజీఎంపీ నిధులతో డ్రైనేజీలు, అంతర్గత రోడ్లు నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యదర్శులు పంచాయతీలు అభివృద్ధి పథంలో నడిచేలా ఆదాయ వనరులు సృష్టించాలన్నారు. వీధిలైట్లు, విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ లైన్లు సక్రమంగా లేకుంటే జీజీఎంపీ నిధులతో కొత్త లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా అందుతున్నాయా లేదా అని తెలుసుకుని వివిధ కారణాలతో ఎవరికైనా పథకాలు అందకపోతే వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటిస్తుండగా టీడీపీ నాయకులు, గ్రామ సర్పంచ్ బొల్లినేని నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నట్లు సర్పంచ్ ఎమ్మెల్యేకి వివరించారు. నియోజకవర్గ పరిశీలకుడు కొమ్మూరి కనకారావు, ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య, కన్వీనర్ పి.తిరపతిరెడ్డి, మండల మీడియా అధికార ప్రతినిధి వి.క్రిష్టారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.శ్రీనివాసులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల వద్దకు చేర్చడమే లక్ష్యం



తూమాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వరికూటి

జరుగుమల్లి (సింగరాయకొండ): ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలతో సంబంధం లేకుండా నిష్పక్షపాతంగా అవినీతికి తావు లేకుండా అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. తాము ఆ పథకాలు అందరికీ సక్రమంగా అందుతున్నాయా లేదా అని పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. జరుగుమల్లి మండలం తూమాడులో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో మాట్లాడారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయ పరిధిలో వలంటీర్‌కు సహాయంగా ఇద్దరు గృహ సారథులను, సచివాలయానికి ఇద్దరు పురుషులు, ఒక మహిళ కన్వీనర్‌ను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఇంత చేస్తుంటే టీడీపీ వారు జగన్ మీద అక్కసుతో తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థ రద్దు చేస్తామని ప్రచారం చేస్తున్నారని.. వీరేమయినా జన్మభూమి కమిటీల మాదిరిగా ప్రజలను దోచుకోకుండా ఒకటో తేదీన తలుపు తట్టి పింఛన్ డబ్బులు ఇస్తున్నందుకా అని ఎద్దేవా చేశారు. ప్రతి పేదవానికి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకుని రాకపోతే ఇప్పిస్తున్నామే తప్ప తాము ఓట్ల కోసం రాలేదన్నారు. పొగాకు కూలీలతో స్వయంగా ముచ్చటించారు. తూమాటి శేషారెడ్డి, ఇంకొల్లు రవికుమార్, గడియం శ్రీను, గడియం కృష్ణ, కాటంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎస్ సురేంద్ర పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ యు పుల్లారావు

కనిగిరి రూరల్: రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ యు పుల్లారావు హెచ్చరించారు. జేసీ, ఆర్డీఓ ఆదేశాలకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పుల్లారావు మాట్లాడుతూ భూమిని ప్లాట్లు వేసే ముందు రియల్టర్లు చట్టప్రకారం ఎలాంటి నిబంధనలు పాటించాలో వివరించారు. గత 8 ఏళ్ల నుంచి సుమారు 194 లే అవుట్లకు కన్వర్షన్‌కు ఫీజులు కట్టారని, వాటిలో 164 చట్ట ప్రకారం నిబంధలు పాటించకపోవడంతో తిరస్కరించినట్లు తెలిపారు. భూమి మీద వ్యవసాయేతర కార్యక్రమాలు ప్రారంభించక ముందే చలానా కట్టాలని, సబ్ డివిజన్ చేయించుకోవాలి, వెబ్‌ల్యాండ్‌లో నమోదు కావాలని, ఆ తర్వాతే తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల ద్వారా ఉడా అనుమతి పొంది లే అవుట్లు వేయాలన్నారు. అసైన్డ్ ల్యాండ్‌కు ఎటువంటి అనుమతులు ఉండవన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

ముగ్గురు జూదరుల అరెస్టు



పోలీసుల అదుపులో పందెంరాయుళ్లు

గుడ్లూరు: కోడి పందేల స్థావరంపై దాడి చేసి ముగ్గురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రసాదరెడ్డి తెలిపారు. మండలంలోని ఏలూరుపాడు పొలాల్లో కోడి పందేలు వేస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్సై సిబ్బందితో దాడి చేసి ముగ్గురు జూదరులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జూదరులను కందుకూరు కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

వీసీపల్లి: కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని పెద యిర్లపాడు గ్రామ శివారులో కోడి పందేలు జరుగుతున్నట్లు సమాచారం మేరకు ఎస్సై నాగేశ్వరరావు సిబ్బందితో దాడి చేశారు. దాడిలో ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1800 నగదు, 2 కోళ్ల స్వాధీనం చేసుకున్నారు. పండుగను పురస్కరించుకొని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జంకెను కలిసిన డాక్టర్ బత్తుల



జంకె వెంకటరెడ్డిని సన్మానిస్తున్న డాక్టర్ బత్తుల

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని మంగళవారం మార్కాపురంలోని ఆయన నివాసంలో పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు రాష్ట్ర పదవి రావటానికి సహకరించిన జంకె వెంకటరెడ్డికి డాక్టర్ బత్తుల కృతజ్ఞతలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈనెల 27వ తేదీ నెల్లూరులో తన రెండో కుమార్తె సాయిశివాని వివాహ మహోత్సవానికి హాజరై ఆశీర్వదించాలని కోరుతూ శుభలేఖ అందజేశారు. వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, నున్నా బ్రహ్మయ్య ఉన్నారు.

సమన్వయంతో పనిచేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

లింగసముద్రం: సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక వేముల అంజయ్య కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో మంగళవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లలో ఇద్దరు పరుషులు, ఒక మహిళ తప్పనిసరిగా ఉండేలా నియమించినట్లు తెలిపారు. వీరంతా కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కొమ్మూరి కనకారావు, జెడ్పీటీసీ డాక్టర్ చెన్ను నళినీపద్మ, ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య, కన్వీనర్ పి.తిరపతిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సురేష్‌శర్మను అభినందించిన వరికూటి



సురేష్‌శర్మను అభినందిస్తున్న అశోక్‌బాబు

జరుగుమల్లి(సింగరాయకొండ): చిన్న వయసులో జ్యోతిష్య శాస్త్రంలో డాక్టరేట్ పొందిన తూమాడు గ్రామానికి చెందిన ఘంటశాల సురేష్‌శర్మను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అభినందించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సురేష్‌శర్మ ఇంటికి వెళ్లిన వరికూటికి ఆయన సాధించిన డాక్టరేట్ గురించి స్థానికులు తెలియజేశారు. ప్రాగ్ జ్యోతిష్య విశ్వవిద్యాపీఠం ఆఫ్ అకల్ట్ సైన్సెస్ ఆధ్వర్యంలో గౌహతిలో డాక్టర్ శంకరమంచి రామకృష్ణ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా సురేష్‌శర్మను వరికూటి సత్కరించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



కనిగిరిలో విజేతలకు బహుమతులు అందచేస్తున్న ప్రిన్సిపాల్



కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో బహుమతి అందుకుంటున్న మహిళ

కనిగిరి రూరల్: సంక్రాంతిని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనగా విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ పి. రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జె.సురేష్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కందుకూరు రూరల్: పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నెల్లూరుకు చెందిన చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో కె.విజయలక్ష్మి, డి.సువర్ణ, ఏ.హారికలు ప్రథమ, ఎం.శ్యామలగౌరి, ఎస్.జెనీఫా, ఎం.కళ్యాణిలు ద్వితీయ బహుమతి, ఎం.వరలక్ష్మి, డి.కల్పనా, దాస్, ఏ.సౌమ్య తృతీయ బహుమతి సాధించినట్లు చిన్మయ మిషన్ సెక్రటరి రాంప్రసాద్ తెలిపారు. కళాశాల విద్యార్థినీ డి.సువర్ణ ప్రథమ బహుమతి సాధించింది. సువర్ణను కళాశాల ప్రిన్సిపాల్ రవి కుమార్ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, కల్చరల్ కమిటీ కన్వీనర్ నరేంద్ర, అధ్యాపకులు కె.సుజాత పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

కందుకూరు అర్బన్: జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షులు చనమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. శీలం అరుణ వెంకటేష్, ప్రభావతిదానియేలు, రవి, సంతోషమ్మ, శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు వేరు చేసే విధానంపై అవగాహన



ప్రజలకు అవగాహన కలిగిస్తున్న కమిషనర్

కందుకూరు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో కమిషనర్ ఎస్.మనోహర్ మంగళవారం పర్యటించారు. ప్రతి ఇంటికి వద్దకు వెళ్లి ఇంటి వద్దే వ్యర్థాలను వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఐక్యత పెంపొందించేందుకు క్రీడలు దోహదం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు

పొన్నలూరు: క్రీడలు ఐక్యతను పెంపొంది స్తాయని జెడ్పీటీసీ సభ్యుడు బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని పైరెడ్డిపాలెం గ్రామంలో సంక్రాంతిని పురష్కరించుకొని గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం బి.వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు సిరిగిరి గోపాల్‌రెడ్డి, కర్నా మస్తాన్‌రెడ్డి, సగిలి సుధాకర్‌రెడ్డి, బాలిరెడ్డి, కోటిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

హనుమంతునిపాడు: సంక్రాంతిని పురస్కరించుకొని మండల పరిధిలో ఆవులవారిపల్లిలో ఏఎం యూత్ ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను సీఐ అప్పారావు, ఎస్సై జీవీ కృష్ణ పావనిలు మంగళవారం ప్రారంభించారు. యూత్ పోర్స్ సభ్యులు ముల్లంగి నారాయణరెడ్డి, కమిటీ సభ్యులు ఉన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

● 78 మందికి రూ.2.28 లక్షలు జరిమానా



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

సింగరాయకొండ: మండలంలో మంగళవారం విద్యుత్ శాఖ డీఈ ఎం.వీరయ్య, ఒంగోలు విద్యుత్ విజిలెన్స్ డీఈ కోట శ్రీనివాసరావు నిర్వహించిన దాడుల్లో 78 కేసులు నమోదు చేసి 2.28 లక్షల రూపాయల జరిమానా విధించినట్లు ఏడీఈ పి.యుగంధర్ తెలిపారు. కందుకూరు డివిజన్ పరిధిలోని ఏడీఈలు, ఏఈలు 30 బ్యాచ్‌లుగా ఏర్పడి దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 3 విద్యుత్ మీటర్ల ట్యాంపరింగ్ కేసులు, 3 విద్యుత్ మాల్ ప్రాక్టీసింగ్ కేసులు, 72 ఓవర్ కెపాసిటీ కేసులు నమోదు చేసి, రూ.2.06 లక్షల జరిమానా విధించినట్లు వివరించారు. ఏఈ సాంబశివరావు, డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



భూమిపూజలో చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 11వ వార్డులోని టకారిపాలెంలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.23 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు చైర్మన్, కమిషనర్ మంగళవారం భూమిపూజ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, మాణిక్యరావు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

హనుమంతునిపాడు: మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీవీ. కృష్ణారావు, పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ గాయం సావిత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొంటారన్నారు. అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

ట్రాక్టర్ బోల్తా



గుంతలో బోల్తా పడి ఉన్న ట్రాక్టర్

సీఎస్‌పురం: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడగా అదృష్టవశాత్తు ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ సంఘటన మండలంలోని డీజీపేట రోడ్డు మలుపు వద్ద మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..సీఎస్‌పురంకు చెందిన ట్రాక్టర్ కంకర లోడుతో అయ్యలూరివారిపల్లె వెళుతుంది. రంగనాయుడుపల్లి బస్టాఫ్ దాటిన తర్వాత ఉన్న మొదటి మలుపులో చప్టా వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న గుంతలో బోల్తా పడింది. అయితే అదృష్టవశాతు ట్రాక్టర్ ట్రాలీ గుంత గడ్డపై పడగా ట్రాక్టర్ ఇంజన్ గుంతలో పడింది. డ్రైవర్ ఊసా మాలయ్య, మరో వ్యక్తి ఇద్దరూ ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు.

పరిమిత వేగంతో వాహనాలు నడపాలి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

గుడ్లూరు: టిప్పర్ల డ్రైవర్లు పరిమిత వేగంతో వాహనాలు నడపాలని కందుకూరు డీఎస్పీ కండె శ్రీనివాసరావు అన్నారు. మండంలోని మొండివారిపాలెంలో రామాయపట్నం పోర్టు వద్ద టిప్పర్ల డ్రైవర్లకు డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ చీమకుర్తి నుంచి టిప్పర్లలో రాళ్లు తీసుకువస్తున్న డ్రైవర్లు అతి వేగంగా వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. సీఐ సుబ్బారావు,ఎస్సై ప్రసాదరెడ్డి, పోర్టు నిర్మాణ సంస్థ అరబిందో కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

పామూరు: బెంగళూరులో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు షేక్ మస్తాన్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా మంగళవారం సీఐటీయూ జెండాను సీనియర్ నాయకుడు అల్లాభక్షుతో కలిసి ఆవిష్కరించారు. కొండయ్య, మురళి, వంశీ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

రేపు కన్వీనర్ల సమావేశం

గుడ్లూరు: మండలంలోని వైఎస్సార్ సీపీ సచివాలయ గ్రామ, వార్డు కన్వీనర్ల సమావేశం గురువారం జరుగుతుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సినిమాహాలు సెంటర్ వద్ద ఉన్న గొల్ల కంతయ్య-లక్ష్మమ్మ ఫంక్షన్ హాల్‌లో సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని 16 సచివాలయాల కన్వీనర్లు, నాయకులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.